

అమ్మవారికి తిరుమంజన సేవ

తాడేపల్లి రూరల్: విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై అష్టలక్ష్ముల ప్రతిష్ఠా వార్షికోత్సవాలు సోమవారం మూడో రోజుకు చేరాయి. అమ్మవార్లకు తిరుమంజన సేవ నిర్వహించారు.



దుర్గమ్మ సేవలో మంత్రి అంబటి

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మను మంత్రి అంబటి రాంబాబు సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కె.రాంబాబు, ఈఓ భ్రమరాంబ స్వాగతం పలికారు.

కరోనా జీరో

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించ లేదు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
గుంటూరు	6:26	4:43
నరసరావుపేట	6:28	4:42
బాపట్ల	6:26	4:43

న్యూస్‌రీల్

నేటి నుంచి ఒంటి పూట అంగన్‌వాడీ బడులు

నెహ్రూనగర్: అంగన్‌వాడీ కేంద్రాలు మంగళవారం నుంచి ఒంటి పూట పనిచేయనున్నాయి. ఉదయం 8 గంటలకు అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటలకు వరకు పనిచేస్తాయని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.మనోరంజని సోమవారం తెలిపారు. మే 31వ తేదీ వరకు అమలులో ఉంటుందని చెప్పారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానికి బాపట్ల జిల్లాకు చెందిన భక్తులు రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు. బాపట్ల జిల్లా ఖాజీపాలెంనకు చెందిన మంతెన సుబ్బరాజు, సత్యవతి దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు సోమవారం ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. పాలక మండలి సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు సమన్వయంతో పనిచేయండి

నరసరావుపేట: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఫ్యామిలీ ఫిజిషియన్' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ డివిజన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులతో ముఖ్యమంత్రి పర్యటనపై ఆదివారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల ఆరో తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిలకలూరిపేట లింగంగుంట నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. సామాన్య ప్రజానీకానికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని కోరారు. ఏఎన్ఎంలు అందరూ ముఖ్యమంత్రి కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అవసరమైన మజ్జిగ ప్యాకెట్లు, మంచినీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా పార్కింగ్ సమస్య ఎదురు కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, డీఆర్వో కె.వినాయకం పాల్గొన్నారు.

మిర్చి యార్డుకు 1,33,572 బస్తాల రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,33,572 మిర్చి బస్తాలు వచ్చాయి. గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,26,058 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,200 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 90,338 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

దిగ్విజయం తొలి వసంతం

గుంటూరు అంటే ఓ బ్రాండ్.. మిర్చి ఘాటు.. పసుపు మేలిమి.. వ్యాపార వాణిజ్య రంగాల్లోనూ దిట్ట.. విద్యారంగానికి కోట.. సాంస్కృతిక రాజధానిగానూ బాసిల్లుతోంది.. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి ఓ ఎత్తు.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే తనదైన అభివృద్ధి మార్కు కనిపించింది. రాష్ట్రంలో పెద్ద జిల్లాగా ఉండేది.. పరిపాలన సౌలభ్యం కోసం విభజించడంతో అధికారులు పూర్తి స్థాయిలో సమయాన్ని కేటాయించారు. జిల్లాలో అధిక భాగం పట్టణీకరణ కావడంతో అందుకు అనుగుణంగా నిధులు వెచ్చించారు. దీంతో పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం సులభతరమైంది. సమస్యలు చెప్పిన వెంటనే అధికారులు తక్షణమే స్పందించి అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. జిల్లా ఏర్పడి ఏడాది పూర్తి అయిన సందర్భంగా గుంటూరు జిల్లా అభివృద్ధిపై కథనం..



సుందరంగా తీర్చిదిద్దిన గుంటూరు నగరంలోని గోరంట్ల రహదారి

ప్రగతి పరుగులు..

- చిన్న జిల్లా కావడంతో అభివృద్ధికి అవకాశం
- వారంలో మూడు రోజులు జిల్లాలో అధికారుల పర్యటన
- సమస్యల పరిష్కారం వేగవంతం
- స్పందనకు తగ్గుతున్న ఫిర్యాదులు
- శరవేగంగా అభివృద్ధి: కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లా పునర్విభజనలో భాగంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలుగా ఏర్పాటు చేశారు. ఏడాది పూర్తి అయింది. చిన్న జిల్లాలు కావడంతో సమస్యల పరిష్కారం వేగం పుంజుకుంది. జిల్లా యంత్రం సమన్వయంతో పనిచేస్తుండడంతో అభివృద్ధి పరుగులు పెడుతోంది. స్పందనకి వస్తున్న ఫిర్యాదులు కూడా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 15,129 ఫిర్యాదులు రాగా అందులో 14,679 ఫిర్యాదులు పరిష్కరించారు. కేవలం 409 ఫిర్యాదులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.

రెవెన్యూ సమస్యలపై దృష్టి..

రెవెన్యూ సమస్యలు కూడా వేగంగా పరిష్కారం అవుతున్నాయి. చుక్కల భూముల కష్టాలకు ఈ ఏడాది చెల్లుచీటి ఇచ్చారు. 1933.51 ఎకరాల భూమిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించారు. భూమి లేని పేదలకు 66.18 ఎకరాలు కేటాయించారు. మాజీ సైనికుల కుటుంబాలకు 23 మందికి భూమి కేటాయింపు జరిపారు. లంక భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులు 410 మందికి 247.88 ఎకరాల భూమిని లీజుకు ఇచ్చారు. ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం 147 ఎకరాల భూమిని కేటాయించారు.

రీసర్వే పనులు..

జిల్లాలో ఇప్పటి వరకు 4,983 ఎకరాల్లో రీసర్వే పూర్తి అయింది. ఈ ఏడాది 23 గ్రామాలను రీ సర్వే కింద తీసుకోగా ఐదు పూర్తి చేశారు. అధికార యంత్రాంగం కూడా వారంలో మూడు రోజులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తుండటంతో పనులు వేగంగా పూర్తి అవుతున్నాయి.

గుంటూరు చానల్ విస్తరణ..

గుంటూరు జిల్లా ప్రజల చిరకాల కోరికగా మిగిలిపోయిన గుంటూరు చానల్ విస్తరణ పనులు వేగం పుంజుకున్నాయి. విస్తరణ కోసం రూ.274.53 కోట్లకు పరిపాలనా అనుమతులు లభించాయి. దీని వల్ల అదనంగా 48 వేల ఎకరాల ఆయకట్టు పెరుగుతోంది. భూసేకరణ కోసం పీఎన్ నోటిఫికేషన్ ఇచ్చారు. 381.33 ఎకరాల భూసేకరణ కోసం 11 గ్రామాలు, మూడు మండలాల పరిధిలో విస్తరించి ఉంది.

ధాన్యం కొనుగోలు ఇలా..

ఈ ఏడాది ఖరీఫ్‌లో 15,008 టన్నుల ధాన్యం జిల్లా యంత్రాంగం కొనుగోలు చేయగా, రబీలో 5641 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మార్క్‌ఫెడ్ కింద 263 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 32,868 టన్నుల ఎరువులను రైతులకు అందించారు.

గడప గడపకు మన ప్రభుత్వం..

గడప గడపకు మన ప్రభుత్వం కింద ఇప్పటి వరకు 844 పనులకు సంబంధించి 746 పనులకు పరిపాలనా ఆమోదం లభించగా, 47.97 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. జిల్లాలో ఈ ఏడాది కొత్తగా 53 మందికి కాంపాసినేట్ అపాయింట్‌మెంట్లు ఇవ్వడం జరిగింది. ఏపీ సేవా సర్వీసుల కింద గత ఏడాది 5,70,650 సేవలకు గాను 4,97,68,679 రూపాయలు ఆదాయం రాగా, ఈ ఏడాది 8,50,397 సర్వీసులకు గాను 6,52,98,752 రూపాయల ఆదాయం వచ్చింది.

పింఛన్ల పంపిణీ

వైఎస్సార్ పెన్షన్ కానుక కింద 2,55,669 మందికి 748.52 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. పెన్షన్లు గత ఏడాది 6,705 మందికి కొత్తగా మంజూరు చేయగా ఈ ఏడాది 24,069 మందికి ఇవ్వడం జరిగింది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకార్డులు గత ఏడాది 2,119 మందికి ఇవ్వగా ఈ ఏడాది 18,121 మందికి కొత్తగా ఇచ్చారు. గత ఏడాది బియ్యం కార్డులు 897 ఇవ్వగా ఈ ఏడాది 36,674 మందికి ఇచ్చారు.

విద్యా రంగానికి..

విద్యారంగానికి వస్తే జగనన్న విద్యా కానుక కిట్ల కోసం జిల్లాలో గత ఏడాది రూ.22.96 కోట్లు ఖర్చు పెట్టగా ఈ ఏడాది రూ.27.12 కోట్లు ఖర్చు చేశారు. జగనన్న అమ్మఒడి కింద గత ఏడాది రూ.219.34 కోట్లు ఖర్చు పెట్టగా ఈ ఏడాది 232.99 కోట్లు ఖర్చు చేశారు. మనబడి నాడు– నేడు కింద 308 స్కూళ్లు 67.85 కోట్ల రూపాయలు ఖర్చు చేయగా, ఈ ఏడాది 561 స్కూళ్లను 207 కోట్ల రూపాయల ఖర్చుతో అభివృద్ధి చేస్తున్నారు. 50.56 కోట్ల రూపాయల ఖర్చుతో 15,800 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు.

అందరికీ వైద్యం..

ఆరోగ్యశ్రీ కింద గత ఏడాది రూ.131.63 కోట్లు ఖర్చు పెడితే ఈ ఏడాది 157.29 కోట్లు ఖర్చు చేశారు. ఆరోగ్య ఆసరా కింద 33,318 మంది రోగులకు రూ.22.43 కోట్లు ఖర్చు చేశారు. ఆరోగ్య రంగంలో భారీగా పోస్టులు భర్తీ చేశారు. ఈ ఏడాది 14 మంది స్పెషలిస్ట్ డాక్టర్లు, 46 మంది మెడికల్ ఆఫీసర్లు, 78 మంది స్టాఫ్ నర్సులు, 300 మంది పారామెడికల్, 61 మంది ఇతర సిబ్బందిని నియమించారు.

జగనన్న కాలనీలకు నిధుల వరద..

గృహ నిర్మాణానికి వస్తే ఈ ఏడాది కొత్తగా 30,466 ఇళ్లు ప్రారంభించగా, 6,486 ఇళ్లు పూర్తి చేశారు. రూ.295.34 కోట్ల బిల్లులు విడుదల చేశారు. పీఆర్ విభాగం పరిధిలో రూ.14.23 కోట్లతో 18.26 కిలోమీటర్ల మేర రోడ్లు వేశారు. రూ.16.50 కోట్లతో 46 సచివాలయ భవనాలు, రూ.4.36 కోట్లతో 20 రైతు భరోసా కేంద్రాలు పూర్తి చేశారు. రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో 156 కి.మీ. రోడ్లు వేశారు. ఆర్‌డబ్ల్యూ ఎస్ కింద 92 పనులు రూ.6.61 కోట్లతో పూర్తి చేశారు. డ్వామా పరిధిలో 45 అమృత్ సరోవర్ పనులు పూర్తి చేశారు.

సాంఘిక సంక్షేమం..

జగనన్న విద్యాదీవెన కింద ఎస్సీ విద్యార్థులకు రూ.176.90 కోట్లు, జగనన్న విద్యా వసతి దీవెన కింద రూ.39 కోట్లు, విదేశీ విద్యాదీవెన రూ.కోటి 21 లక్షలు, ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ హాస్టల్స్‌కి రూ.4.35 కోట్లు, ఉచిత విద్యుత్ కింద రూ.2.86 కోట్లు ఖర్చు చేశారు. డీఆర్‌డీఏ పరిధిలో స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజి కింద రూ.843 కోట్ల రూపాయలు, వైఎస్సార్ ఆసరా కింద రూ.163 కోట్లు, జగనన్న తోడు కింద 40.63 కోట్లు, శ్రీనిధి కింద రూ.88.79 కోట్ల సాయం చేశారు.

వ్యవసాయ రంగానికి..

వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.140.91 కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీ కింద 7.37 కోట్లు, కౌలు రైతులకు రూ.39.73 కోట్ల రుణాలు, విత్తన సబ్సిడీ కింద రూ.53 లక్షలు, వైఎస్సార్ యంత్ర సేవ కింద 10.35 కోట్లు రూపాయలు, పంట నష్టం కిద 37.94 కోట్లు విడుదల చేశారు. ఉద్యాన శాఖ కింద కోటీ 27 లక్షల రూపాయల ఆర్థిక సహకారం అందించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు: కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి




చిన్న జిల్లాలుగా మారిన తర్వాత జిల్లా అభివృద్ధి శరవేగంగా సాగుతోంది. ప్రాధాన్య భవనాలు త్వరితగతిన జరుగుతున్నాయి. వైఎస్సార్ అర్బన్, విలేజి క్లీనిక్‌ల నిర్మాణం వేగవంతం అయింది. ఈ ఏడాది 36 పూర్తి చేసుకోగా 32 ప్రారంభించాం. వైద్య రంగంలో ఒక్క ఖాళీ కూడా లేకుండా ఎప్పటికప్పుడు ఖాళీలు భర్తీ చేస్తున్నాం. విద్యారంగంపై కూడా పూర్తి దృష్టి పెట్టాం. రెండోదశ నాడు– నేడు పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. త్వరలో గుంటూరు చానల్ విస్తరణ పనులు కూడా చేపడతాం.

వెండితెరపై 'టైగర్ నాగేశ్వరరావు'

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని స్టువర్టుపురానికి చెందిన ఒకనాటి గజదొంగ టైగర్ నాగేశ్వరరావు. పెద్దలను కొట్టి పేదలకు పంచిన రాబిన్‌హుడ్‌గా ఫ్యాన్ పాలోయింగ్ కలిగిన నేరస్తుడు. పోలీసు అధికారులకు ముందుగా చెప్పి జైలు నుంచి తప్పించుకున్న 'టైగర్'. పట్టుకోలేరంటూ సవాల్ చేసి మరీ నేరాలు చేసిన తెంపరి. పోలీస్ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాక వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమాన జనంతో ఆయన అంతిమ యాత్రకు మూడు రోజులు పట్టింది. మృతి చెందిన 43 ఏళ్లకు నాగేశ్వరరావు జీవిత కథ సినిమాగా ప్రేక్షకుల ముందుకు రానుంది. గజదొంగ హీరోయిజమే ఈ పాన్‌ఇండియా సినిమాకు ప్రేరణ. 'మాస్ మహరాజ్' రవితేజ ఈ చిత్ర హీరో.

– గుంటూరు డెస్క్



స్టువర్టుపురం ఏరియల్ వ్యూ (ఇన్‌సెట్) టైగర్ నాగేశ్వరరావు ఫైల్ ఫొటో

- పెద్దలను కొట్టి పేదలకు పంచిన రాబిన్‌హుడ్
- పోలీసులకు చెప్పి మరీ నేరాలు చేసిన గజదొంగ
- ఎన్‌కౌంటర్‌లో హతుడైన 43 ఏళ్లకు బయోపిక్
- రవితేజ హీరోగా దసరాకు రానున్న పాన్‌ఇండియా సినిమా

విజయవాడ– చెన్నై రైలు మార్గంలో బాపట్ల సమీపంలో ఉంటుంది స్టువర్టుపురం. 1874 సెటిల్‌మెంట్ చట్టం ప్రకారం ఏర్పడిన గ్రామం. వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడేవారిని, ఇతర నేరస్తులను గుర్తించి నిఘా ఉంచేందుకని ఇక్కడ నివాసం కల్పించారు. అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీ హోం సభ్యుడు హెరాల్డ్ స్టువర్ట్ పేరుతో గ్రామానికి నామకరణం చేశారు. నేరాల్లో ఆరితేరిన వారు ముఠాలుగా వివిధ రాష్ట్రాల్లో దోపిడీ, దొంగతనాలకు పాల్పడేవారు. స్టువర్టుపురం దొంగలంటేనే జనంలో ఒకరకమైన భీతి ఉండేది. టైగర్ నాగేశ్వరరావు తెర పైకి వచ్చాక ఆ గ్రామం పేరు మరింతగా కలకలం రేపింది. తోటి దొంగలకు హీరోగా, పేదలకు ఆపద్బాంధవుడిగా, పోలీసులకు కొరకరాని కొయ్యగా తయారయ్యాడు. దొంగతనాలు వారసత్వంగా కలిగిన కుటుంబంలో ఇద్దరు అన్నల తర్వాత గరిక నాగేశ్వరరావు జన్మించాడు. జనన సంవత్సరం 1953–56 మధ్య. సోదరులు ప్రసాద్, ప్రభాకర్. వీరి చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. మరికొన్నేళ్లకు తండ్రినీ కోల్పోయారు. తండ్రి బాటలోనే దొంగతనాలు చేస్తున్న ప్రభాకర్ ఆచూకీ కోసం ప్రయత్నించి విఫలమైన పోలీసులు, సోదరుడైన నాగేశ్వరరావును తీసుకెళ్లి, తీవ్రంగా హింసించారు. ఏ నేరం చేయకుండానే పోలీసుల చిత్రహింసలు అనుభవించిన 15 ఏళ్ల నాగేశ్వరరావు తండ్రి, అన్న బాటలోనే నేరస్తుల జత కట్టాడు. 1970లో తమిళనాడు వెళ్లి మారుపేర్లతో నివాసముంటూ దొంగతనాలు ఆరంభించాడు. అన్న ప్రభాకర్ జైలు నుంచి విడుదలై వచ్చాక అతడి ముఠాలో పని చేయసాగాడు.

'ఆంధ్రా టైగర్‌రా'...

ఒక పర్యాయం తమిళనాడు పోలీసులు అన్నదమ్ములను అరెస్టు చేశారు. తిరువాళ్లూరు జైలులో ఉన్న నాగేశ్వరరావును అప్పటి ఐజీ అరుళ్ విచారించారు. తనను చిత్రహింసలు పెడితే రెండు రోజుల్లో జైలు నుంచి పారిపోతానని నాగేశ్వరరావు ఐజీతో స్పష్టంగా చెప్పాడు. అన్న వద్దని చెప్పినా వినకుండా, సబ్‌జైలు నుంచి పోలీసులను కొట్టి మరీ పరారయ్యాడు. తనను వెతుక్కుంటూ స్టువర్టుపురం వచ్చిన పోలీసులనూ కొట్టాడు. 'వచ్చే నెలలో మద్రాస్ సిటీలోనే నేరం చేస్తాను... దమ్ముంటే పట్టుకోమను' అంటూ వారిని పంపేశాడు. అన్నట్టుగానే మద్రాస్ సిటీలో వరుసగా మూడు నెలలు దొంగతనాలు చేసి పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు. విసుగెత్తిపోయిన ఐజీ అరుళ్ నిజంగా వాడు 'ఆంధ్రా టైగర్‌రా' అన్నాడు. అప్పట్నుంచి నాగేశ్వరరావు ఇంటి పేరు టైగర్ అయింది. ఏపీ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో 15 ఏళ్లపాటు దొంగతనాలు, దోపిడీలకు పాల్పడిన టైగర్ నాగేశ్వరరావు పోలీసులకు సింహస్వప్నంగా మారాడు. 1974లో జరిగిన బనగానపల్లె బ్యాంకు దోపిడీ అందులో ఒకటి. పోలీస్‌స్టేషనుకు అత్యంత సమీపంలో ఉండే బ్యాంకును నాగేశ్వరరావు ముఠా కొల్లగొట్టింది. సేఫ్‌ను పగులగొట్టి వెంట తీసుకెళ్లారు. గ్రామాన్ని చుట్టుముట్టిన పోలీసులకు ప్రభాకరరావు దొరికాడు మినహా నాగేశ్వరరావు ఆచూకీ దొరకలేదు. ఒక బిస్కట్ కంపెనీ అధినేత, అప్పటి హోంశాఖ సహాయమంత్రి వియ్యంకుడి కుటుంబాన్ని దారికాచి దోచారు.

పట్టుకునేందుకు పోలీసుల వ్యూహం ...

తలనొప్పిగా మారిన నాగేశ్వరరావును ఎలాగైనా మట్టుపెట్టాలని పోలీస్ శాఖలోని కొందరు అధికారులు సిద్ధమయ్యారు. మరొక దొంగ ఇచ్చిన సమాచారంతో నాగేశ్వరరావు తరచూ ఒక మహిళ ఇంటికి వచ్చి వెళుతుంటాడని తెలుసుకున్నారు. డబ్బాశ చూపారు. పాలల్లో మత్తుమందు కలిపి, తమకు సంకేతం ఇవ్వాలని, లేకుంటే తనను చంపేస్తామని బెదిరించారు. భయపడిపోయిన ఆ మహిళ తర్వాత నాలుగు రోజులకు 1980 మార్చి 24న తెల్లవారుజామున ఇంటికి వచ్చిన నాగేశ్వరరావుకు పోలీసులు చెప్పినట్టే మత్తుమందు కలిపిన పాలు తాగించింది. మత్తులో నిద్రపోతున్న అతడిపై పోలీసు అధికారి తుపాకీ కాల్పులు జరిపాడు. ఎన్‌కౌంటరులో హతమైనట్టు ప్రకటించారు. శవపరీక్ష నిమిత్తం చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ్నుంచి ఆరంభమైన అంతిమయాత్ర స్టువర్టుపురం కాలనీకి చేరేందుకు మూడురోజులు పట్టిందట! మూడు రాష్ట్రాల్నుంచి ఎందరో అభిమానులు ఆ యాత్రలో పాల్గొన్నారు.


మహిళలంటే గౌరవం...



మేం ఒకప్పుడు దొంగతనాలు చేసినా, మహిళలంటే మాకెంతో గౌరవం...ఒంటరిగా ఉన్నా బంగారం, డబ్బు దోచుకునేవాళ్లం మినహా ఎలాంటి అకృత్యాలకు పాల్పడేవాళ్లం కాదు... నేటికాలంలో ఆడవాళ్లపై జరుగుతున్న ఘోరాలు వింటుంటే బాధ కలుగుతోంది. నా సోదరుడు నాగేశ్వరరావు ఆర్థికసాయం కూడా చేసేవాడు. సినిమా తీస్తున్నారు. నన్ను కూడా వివరాలు అడిగారు.

– గరిక ప్రభాకరరావు, నాగేశ్వరరావు సోదరుడు

సుదీర్ఘ పరిశోధన చేశాం...



'దొంగాట' సినిమా చేసేటపుడు ఒక పెద్దాయన ద్వారా టైగర్ నాగేశ్వరరావు గురించి తెలిసింది. దొంగైనా అతడు రాబిన్‌హుడ్ అని చెప్పటంతో ఆసక్తి కలిగింది. వైవిధ్యమైన సినిమాలు, అందులోనూ ఏదైనా బయోపిక్ కూడా తీయాలనుకున్న నాకు, అతడి జీవితంలోని కమర్షియల్ ఎలిమెంట్ నచ్చింది. అప్పట్నుంచి పరిశోధన మొదలైంది. ఎన్నో ఆసక్తిదాయకమైన అంశాలతో సినిమా తీస్తున్నాం.

– వంశీకృష్ణ, సినీదర్శకుడు

చదువులు, వైద్యం, పెళ్లిళ్లకు సాయం ...

ఇన్ని దొంగతనాలు, దోపిడీలు చేసినా నాగేశ్వరరావు మిగుల్చుకుంది ఏమీ లేదంటారు. పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు చీరాల, చుట్టుపక్కల పల్లెల్లోనే తలదాచుకునే వాడు. ఆశ్రయం ఇచ్చినవారికి, సహాయం కోరిన ఇతరులకు ఆర్థిక సహాయం చేసేవాడు. ముఖ్యంగా పిల్లల చదువులు, వైద్యం, పెళ్లిళ్లకు తప్పకుండా సాయం చేసేవాడు. పొగాకు కంపెనీ యజమాని అరాచకంపై మహిళల్ని పోరుబాటకు సిద్ధం చేయటమే కాదు... అతడికి వత్తాసుగా వచ్చిన ఎస్ఐపైనా మహిళలతో దాడి చేయించాడు.

అర్జీలు అధికంగా వస్తున్న శాఖలపై ప్రత్యేక దృష్టి

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: కొన్ని శాఖలకు సంబంధించి ప్రజల నుంచి వస్తున్న అర్జీలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో స్పందన సోమవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలపై కూడా ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్ వరకు ఎందుకొస్తున్నారో ఆయా శాఖాధికారులు ఆలోచన చేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలు స్వీకరించడంతో పాటు వారికి సత్వర న్యాయం అందించడం మన బాధ్యత అని పేర్కొన్నారు. కొందరు సిబ్బంది అర్జీదారులతో దురుసుగా ప్రవర్తిస్తున్న ఘటనలు తన వరకు వస్తున్నాయని హెచ్చరించారు. ఇది సరికాదని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని చెప్పారు. గతంతో పోలిస్తే రీ ఓపెన్ అర్జీలు తగ్గుముఖం పట్టాయని, ఇది జీరో స్థాయికి రావాలని పేర్కొన్నారు. స్పందనకు వచ్చిన 154 అర్జీలను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి పరిశీలించారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి..

డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి. మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని తక్షణం నిలబెట్టుకోవాలి. నాడు– నేడు కింద పాఠశాలలకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్న ప్రభుత్వం ఆ మేర ఉపాధ్యాయులను కూడా నియమించాలి..

–షేక్ వలి, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

- జిల్లాలో 26,455 మంది విద్యార్థులు హాజరు
- గుంటూరులో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి
- ఓ పరీక్ష కేంద్రంలో అరగంట ఆలస్యంగా ప్రశ్నపత్రం పంపిణీ



జలగం రామారావు జీఎంసీ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 138 పరీక్ష కేంద్రాల పరిధిలో ఉదయం 8.00 గంటల నుంచి విద్యార్థులు, వారి వెంట వచ్చిన తల్లిదండ్రులతో కోలాహలం నెలకొంది. ఉదయం 9.00 గంటలకల్లా విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోనికి వెళ్లారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా రాక, పోకలు సాగించారు. సోమవారం జరిగిన ప్రథమ భాష పరీక్షలకు 138 కేంద్రాల పరిధిలో 99.30 శాతం హాజరు నమోదైంది. మొత్తం 26,640 మంది విద్యార్థులకు గాను 26,455 మంది హాజరయ్యారు.

ఓ కేంద్రంలో అరగంట ఆలస్యంగా ప్రశ్నపత్రం..

గుంటూరు నగరంలో అమరావతి రోడ్డులోని నవీన హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అరగంట ఆలస్యంగా ప్రశ్నపత్రం పంపిణీ చేశారు. ఈ కేంద్రంలో కేటాయించిన విద్యార్థులందరూ ఉదయం 9.00 గంటలకే లోపలికి వెళ్లారు. పరీక్ష కేంద్రంలో రోల్ నంబర్ల వారీగా కేటాయించిన తరగతి గదుల్లోకి వెళ్లి కూర్చున్న విద్యార్థులకు ఓఎంఆర్ షీట్లను ఇచ్చిన ఇన్విజిలేటర్లు వాటిని పూర్తి చేయించారు. ఉదయం 9.30 గంటలకు ప్రశ్నపత్రం ఇవ్వాల్సి ఉండగా, 10 గంటల వరకు విద్యార్థులు ప్రశ్నపత్రం కోసం ఎదురు చూశారు. అరగంట ఆలస్యంగా ప్రశ్నపత్రాలను పంపిణీ చేసిన అధికారులు పరీక్ష రాసేందుకు 15 నిమిషాలు అదనంగా సమయాన్ని ఇచ్చారు. పేపర్ ఆలస్యంగా ఇచ్చిన ఘటనపై పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌తో పాటు మీడియా దృష్టికి తెచ్చారు. జరిగిన విషయమై డీఈఓ పి.శైలజను వివరణ కోరగా, విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రాలకు మొదటిసారిగా సీరియల్ నంబరు వేయడంతో, వాటిని క్రమపద్ధతిలో విద్యార్థులకు ఇవ్వాల్సిన దృష్ట్యా, కొంత జాప్యం జరిగిందని చెప్పారు. పరీక్షల మొదటిరోజు కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని కేంద్రాల్లో ఇదే విధంగా జరగడంతో ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లిందన్నారు. దీంతో ప్రశ్నపత్రాలను క్రమపద్ధతిలో పెట్టుకునేందుకు అదనంగా సమయాన్ని ఇస్తున్నట్లు ఉన్నతాధికారులు చెప్పారని వివరించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

గుంటూరు కొత్తపేటలోని జలగం రామారావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థుల హాజరు వివరాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పగడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని సీఎస్, డీఓలను ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ అబ్దుల్ ఖుద్దూస్, హెచ్ఎం సుధారాణి ఉన్నారు. కాగా 39 పరీక్ష కేంద్రాల్లో విద్యా, రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులతో పాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో డీఈఓ పి.శైలజ తనిఖీలు నిర్వహించారు.

ఏపీ క్రెడాయ్ చైర్మన్‌గా ఆళ్ల శివారెడ్డి ఎన్నిక అభినందనీయం

శివారెడ్డి సన్మాన సభలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పాత గుంటూరు: గత మూడు దశాబ్దాలుగా రియల్ ఎస్టేట్ రంగంలో నాణ్యమైన నిర్మాణాలు చేసి, వినియోగదారుల విశ్వాసం పొందిన ఆళ్ల శివారెడ్డి ఆంధ్రప్రదేశ్ క్రెడాయ్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికకావడం అభినందనీయమని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. ఇన్నర్ రింగు రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో క్రెడాయ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డికి సన్మాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సభకు గుంటూరు క్రెడాయ్ చాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్‌కు ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ నిర్మాణరంగంలో అపారమైన అనుభవం కలిగిన శివారెడ్డి క్రెడాయ్ రాష్ట్ర చైర్మన్‌గా ఎన్నిక కావడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి చందు సాంబశివరావు, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు, విశ్రాంత ఎస్పీ కోటేశ్వరరావు, బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, క్రెడాయ్ గుంటూరు చైర్మన్ ఆరుమళ్ల సతీష్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు మెట్టు సాంబశివారెడ్డి, డాక్టర్ డి. సురేష్‌బాబు, కార్యదర్శి తియ్యగూర వినోద్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఆళ్ల నాగార్జునరెడ్డి, రమాకాంత్, శివనాగేశ్వరరావు, కోశాధికారి మద్ది కార్తీక్, సభ్యులు పాల్గొని ఆళ్ల శివారెడ్డిని ఘనంగా సన్మానించారు. శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర క్రెడాయ్ చైర్మన్‌గా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి, బిల్డర్లకు అనుసంధానంగా ఉండి భవన నిర్మాణరంగ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు.



ఆళ్ల శివారెడ్డిని సన్మానించిన ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం

స్పందన అర్జీలపై సత్వర చర్యలు

జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక – స్పందన (గ్రీవెన్స్) జరిగింది. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను ఆలకించారు. స్పందనలో వచ్చే అర్జీలపై సంబంధిత పోలీస్ అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఈ మేరకు జూమ్ ద్వారా జిల్లాలోని పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడారు. ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు, డీఎస్పీ ప్రకాష్‌బాబు (క్రైం) అర్జీలు స్వీకరించారు.


సమస్యలు వింటున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, పక్కన ఏఎస్పీ శ్రీనివాసరావు

ఉద్యోగాల పేరుతో మోసం..

2019 ప్రత్యేక డీఎస్సీలో మిగిలిన ఉద్యోగాలు ఇప్పిస్తానని విజయవాడలోని ఓ ప్రభుత్వ శాఖ ఉన్నతాధికారి ఓ సొసైటీ వ్యక్తిని పరిచయం చేశారు. సదరు వ్యక్తి ఒక్కొక్క ఉద్యోగానికి రూ.5 లక్షలు అడగ్గా, రూ.3 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించాం. 2021లో ఎనిమిది మందిమి రూ.లక్ష చొప్పున అతనికి అడ్వాన్స్ చెల్లించాం. తక్కువ మంది అయితే ఎక్కువ డబ్బులు చెల్లించాల్సి వస్తుందని, అదనంగా ఎవరైనా ఉన్నట్లయితే చెప్పాలని నమ్మబలికాడు. దీంతో సుమారు నలభై మందిమి పోగై రూ.1.20కోట్లను ఫోన్ పే, గూగుల్ పే, బ్యాంక్ ఖాతాల ద్వారా ఉన్నతాధికారి, సొసైటీ వ్యక్తి, ఓ సచివాలయం మహిళా పోలీస్‌లకు ఇచ్చాం. అనంతరం ఏ ఒక్కరికీ ఉద్యోగం ఇప్పించలేదు. దీనికిగాను రూ.100 స్టాంప్ పేపర్లపై సంతకాలు చేసి ఇచ్చారు. ఉద్యోగాల విషయమై అడిగితే బెదిరిస్తున్నారు. ఈ విషయమై మిగతా వారికి చెప్పగా, డబ్బులు ఇవ్వాలంటూ అంటూ నన్ను మానసికంగా వేధిస్తున్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసగించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నా.

– జె.మాతా జయప్రకాష్‌రెడ్డి, కాకినాడ

పన్నుల పేరుతో..

ఇన్‌స్టాగామ్‌లో ఓ ట్రేడర్ ఖాతాకు గతనెల 1న రూ.5 వేలు పెట్టగా, రూ.30 వేలు చెల్లించారు. దీంతో బ్యాంక్, డాలర్లు, ఇంటర్నేషనల్, మేనేజర్ ట్యాక్స్‌లు అంటూ ఆ ట్రేడర్ నిర్వాహకులు చెప్పడంతో మరో రూ.22 లక్షలు వరకు దఫాల వారీగా చెల్లించాం. ప్రస్తుతం మరో రూ.40 వేలు చెల్లిస్తే, రూ.కోటి ఇస్తామంటూ చెబుతున్నారు. మోసగించిన వారిపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని కోరుతున్నా..

– ఎం.అనీల్‌కుమార్, గుంటూరు

రైల్వేలో ఉద్యోగం పేరిట మోసం..

ఏపీ సెక్రటేరియట్‌లోని ఓ శాఖలో అటెండర్‌గా విధులు నిర్వర్తించే ఉద్యోగి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. రూ.15 లక్షలకుగాను 2021 సెప్టెంబర్‌లో గుంటూరు లక్ష్మీపురంలో రూ.11 లక్షలు చెల్లించాం. అనంతరం పెరంబూర్‌లోని రైల్వే ఇంటిగ్రేట్ కోచ్ ఫ్యాక్టరీలో టెక్నికల్ సహాయకుని ఉద్యోగం వచ్చినట్లు వాట్సాప్ ద్వారా మెసెజ్ పంపించాడు. చెన్నై కోయంబేడులో ఒకరిని సంప్రదించాలని చెప్పాడు. అనంతరం ఐడీ కార్డు, అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వగా, రైల్వే ఇంటిగ్రేట్ కోచ్ ఫ్యాక్టరీ వద్దకెళ్లాను. అక్కడ రైల్వే సిబ్బంది కార్డులు చూసి నకిలీవని తేల్చారు. ఈ విషయమై సదరు ఉద్యోగిని ప్రశ్నించి, డబ్బులు అడిగితే బెదిరిస్తున్నాడు. మోసగించిన వ్యక్తులను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని కోరుతున్నా.

– ఆంజనేయ గోపీచంద్, ఎర్రబాలెం, మంగళగిరి

న్యాయవాదుల సంక్షేమానికి కృషి

జీబీఏ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకారం

గుంటూరు లీగల్: 2023–24 సంవత్సరానికి జీబీఏ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. సోమవారం ప్రెసిడెంట్ కె.వి.కె. సురేష్‌తోపాటు వైఎస్ ప్రెసిడెంట్ దాసరి ఉమామహేశ్వరరావు, జనరల్ సెక్రటరీ నాగవంశీకృష్ణ, ట్రెజరర్ విజయ రాజకుమార్, లైబ్రరీ సెక్రటరీ గేరా శ్యాం రత్నరాజ్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ గాలి అశోక్ ఆనంద్, లేడి ఎగ్జిక్యూటివ్ పర్చూరి కుమారి(నంద), సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు ఎం.ఆదిలక్ష్మి, జి.అనూరాధ, జి.విజయకుమార్, పి.బాబూరావు, జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లు రాజేష్ లింగం పూదోట, శ్రీనివాసరావు రాయపూడి (గుండు శ్రీను), జి.లక్ష్మి అధికారిక నియామక పత్రాలు పొందడంతోపాటు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ కె.వి.కె.సురేష్ మాట్లాడుతూ తన గెలుపునకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.


ప్రెసిడెంట్ కె.వి.కె.సురేష్, కార్యవర్గ సభ్యులు

బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం వాహనం

ఎస్సెస్సీ బోర్డు సూపరింటెండెంట్ మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రోడ్డు ప్రమాదంలో ఎస్సెస్సీ బోర్డు సూపరింటెండెంట్ వీరవల్లి రత్నకుమారి(39) మృతి చెందిన ఘటన భవానీపురం గాలీ సాహెబ్ దర్గా సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిలుకలూరిపేటకు చెందిన ఎస్. శ్రీనివాసరావు, వీరవల్లి రత్నకుమారి దంపతులు ఎస్సెస్సీ బోర్డు సూపరింటెండెంట్స్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం గొల్లపూడిలోని ఆంధ్ర హాస్పిటల్ ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. వీరి పెద్ద కుమార్తె పుష్పాంజలి వన్‌టౌన్ ఎట్కిన్ సన్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతోంది. పాపను స్కూల్ నుంచి ఇంటికి తీసుకువచ్చేందుకు శ్రీనివాసరావు దంపతులు బైక్‌పై వన్‌టౌన్ బయలుదేరారు. భవానీపురం గాలిసాహెబ్ దర్గా దాటిన తర్వాత వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన డీసీఎం వాహనం బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌నడుపుతున్న శ్రీనివాసరావు ఎడమవైపుకు పడిపోగా, రత్నకుమారి కుడివైపు పడిపోయింది. డీసీఎం వాహనంవెనుక చక్రం ఆమె పై నుంచి వెళ్లింది.. విషయం తెలుసుకున్న ఎస్సెస్సీ బోర్డు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. స్వల్పంగా గాయపడిన శ్రీనివాసరావును ఆంధ్ర ఆస్పత్రిలో చేర్పించారు. దీనిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

7న స్టువర్టుపురంలో బజరంగ్ 'జగన్నామ సంక్షేమం'

- మహిళలకు శానిటరీ నాప్‌కిన్లు పంపిణీ
- వలంటీర్లకు అవగాహన–పోటీ పరీక్ష
- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ వెల్లడి

కొరిటిపాడు(గుంటూరు): ఈ నెల 7వ తేదీన బాపట్ల జిల్లా స్టువర్టుపురంలో బజరంగ్ జగన్నామ సంక్షేమ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ సోమవారం తెలిపారు. గ్రామంలోని మహిళలకు శానిటరీ నాప్‌కిన్లు పంపిణీ చేస్తామన్నారు. వలంటీర్లకు అవగాహన–పోటీ పరీక్ష, నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్టు వివరించారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, వలంటీర్లకు రూ.5లక్షల ప్రమాద బీమా పాలసీ వంటి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బజరంగ్ 'జగన్నామ సంక్షేమ దినం' కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి, సంక్షేమసారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం రోజున గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మామిళ్లపల్లిలో ఘనంగా ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. కొప్పురావూరు, వెనిగండ్ల, వెల్లలూరు, గుంటూరు, ముత్తాయపాలెం గ్రామాలలో ముగించుకొని ఈ నెల 7న మధ్యాహ్నం 2 గంటలకు బాపట్ల మండలం స్టువర్టుపురంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నారీరుతువు, విద్యావిజేత, థలసేమియా వ్యాధి పరీక్షలు, వలంటీర్లకు అవగాహన–పోటీ పరీక్ష వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల్లో ఎస్పీ తనిఖీలు

నగరంపాలెం: జిల్లాలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హాఫీజ్ పరిశీలించారు. గుంటూరు నగరంలోని ఉర్దూ ఉన్నత పాఠశాల, హిందూ ఉన్నత పాఠశాల, మాజేటి గురవయ్య ఉన్నత పాఠశాలలో పర్యటించారు. ఆయా కేంద్రాలలో ఎంత మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు, వారికి కల్పించిన మౌలిక సౌకర్యాల ఏర్పాట్లపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. స్మార్ట్ వాచ్, మొబైల్‌ఫోన్లు, ఐపాడ్ ఇతరత్రా ఎలక్ట్రానిక్ వస్తువులను లోనికి అనుమతించవద్దని ఎస్పీ సూచించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల అధికార, సిబ్బందికి సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఇన్విజిలేటర్లతో మాట్లాడి, పలు సూచనలిచ్చారు. పరీక్ష వేళల్లో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టామని చెప్పారు. 144 సెక్షన్ అమలుతోపాటు, పరీక్ష కేంద్రాల దగ్గర్లో జిరాక్స్, ప్రింటింగ్ కేంద్రాలను మూసివేయించామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ట్రాఫిక్ పోలీసులకు విధులు కేటాయించామని చెప్పారు. ప్రశ్న, సమాధాన పత్రాలు తరలించేందుకు ఎస్కార్ట్ ఉంటుందని, కొన్ని పరీక్షా కేంద్రాల వద్ద అదనపు పోలీస్ సిబ్బందికి విధులు కేటాయించాలని చెప్పారు. ఎవరైనా మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినా, వారికి సహకరించిన చట్ట ప్రకారం చర్యలు తప్పవని అన్నారు. జిల్లాలోని ఏదైనా పరీక్ష కేంద్రం వద్ద చిన్న ఘటన జరిగిన డయల్ 100 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ నంబర్ 8688831568కు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు, కొత్తపేట పీఎస్, లాలాపేట పీఎస్, అరండల్‌పేట పీఎస్ సీఐలు శ్రీనివాసరెడ్డి, సుబ్బారావు, రామనాయక్ ఉన్నారు.


ఉర్దూ హైస్కూల్‌ను తనిఖీ చేసి, వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హాఫీజ్

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే జైలు

- ఒక్కరోజే జిల్లాలో 138 మందిపై కేసు నమోదు
- బాపట్ల ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే జైలుకెళ్లడం ఖాయమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న మందుబాబులపై చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 138 మందిపై కేసులు నమోదుచేశారు. జిల్లా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కొరడా ఝుళిపించడం జరుగుతుందన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడపడం వలన అనేక మంది రోడ్డు ప్రమాదాలకు గురౌతున్నారన్నారు. మద్యం మత్తులో సాధారణ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే అలాంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రేపల్లె సబ్ డివిజన్ పరిధిలో 27మంది, బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో 58 మంది, చీరాల సబ్ డివిజన్ పరిధిలో 53 మంది జిల్లా వ్యాప్తంగా మొత్తం 138 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వారిని త్వరలో కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.


బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఉత్తమ ప్రదర్శనగా 'కాపల'

- ముగిసిన సుందరయ్య జాతీయస్థాయి నాటికల పోటీలు
- ద్వితీయ, తృతీయ ప్రదర్శనలుగా వెండిఅంచులు, పక్కింటి మొగుడు

యడ్లపాడు: పుచ్చలపల్లి సుందరయ్య 20వ జాతీయస్థాయి తెలుగు సాంఘిక నాటికల పోటీలకు ఆదివారం రాత్రితో తెరపడింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాకు చెందిన పరిషత్ నాటికలు ఈ పోటీల్లో ప్రదర్శించారు. స్థానిక ఎంవీ చౌదరి కళా వేదికపై పోటా పోటీగా తమ ప్రదర్శనలు నిర్వహించారు. ఆయా పోటీలకు ప్రధాన న్యాయనిర్ణేతలుగా బి.దాశరథి, ఆర్.భరద్వాజ, కె.శాంతారావు కాగా, వివిధ రంగాలకు చెందిన మరో 12 మంది వ్యవహరించడం విశేషం. నాటక రంగం అభివృద్ధికి అవిరళ కృషి చేస్తున్న కమిటీ సభ్యులు ముత్తవరపు సురేష్‌బాబు, పద్మారావు, నూతలపాటి కాళిదాసు, జరుగుల శంకరరావులను గ్రామస్థాయి నుంచి ఉమ్మడి తెలుగురాష్ట్రాల్లోని కళాసంస్థలు, కళాకారులు, ప్రముఖులు ప్రశంసించారు.

మూడు రోజుల్లో 9 నాటికలు..

మూడు రోజుల పోటీల్లో 9 నాటికలు ప్రదర్శించగా వాటిలో ఉత్తమంగా కాపల నాటిక నిలిచింది. ఉత్తమ ద్వితీయ ప్రదర్శన వెండిఅంచులు నాటిక, ఉత్తమ తృతీయ ప్రదర్శన పక్కంటి మొగుడు నాటికలు బహుమతులు అందుకున్నాయి. ఆయా నాటికలకు వరుసగా రూ.25వేలు, రూ.22,500, రూ.20వేలు జ్ఞాపికలతో సత్కరించారు. ప్రతి ప్రదర్శనకు రూ.15వేలు, ప్రతి రచయిత, దర్శకుడికి, ఉత్తమ నటీనటులు, వివిధ కేటగిరీలకు ఒక్కొక్కరికీ రూ.1,116, ఉత్తమ సహాయ నటీనటులకు రూ.516 చొప్పున నగదు, జ్ఞాపిక అందించారు.


కాపల నాటిక బృందానికి ఉత్తమ బహుమతి అందజేస్తున్న అతిథులు

వ్యక్తిగత విభాగంలో..

ఉత్తమ రచయితగా యల్లప్రగడ భాస్కరరావు (కాపలా), దర్శకుడు గంగోత్రిసాయి (వెండిఅంచులు), రంగాలంకరణ చైతన్య కళా స్రవంతి యూనిట్ (ఎస్–11), సంగీత దర్శకుడు కేటీడీ కార్తికేయ, ఆహార్యం ఎం.దినేష్‌బాబు (కపిరాజు), ఉత్తమ నటీమణులు అమృతవర్షిణి (ప్రక్షాళన), బి.వనిత (స్వీకారం), ఉత్తమ నటులు బి.చలం (కొత్తపరిమళం), పి.దివాకర్ ఫణీంద్ర (కపిరాజు), జి.కుసుమసాయి (కాపల), ఉత్తమ సహాయనటులు ఇ.పున్నయ్య చౌదరి (ప్రక్షాళన), ఉన్నం వెంకట శేషయ్య (పక్కింటి మొగుడు), వై.అనిల్‌కుమార్ (ఎస్–11) పీవీఆర్ మూర్తి (ప్రేమతో నాన్న), వసంతయామిని (వెండిఅంచులు) పొందారు.

ప్రజలకు అందుబాటులో పాలన

వేటపాలెం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ, రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి పాలన తీసుకొచ్చారని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. అక్కాయిపాలెం పంచాయతీ పరిధిలోని యానాది సంఘం వద్ద రూ.40 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో గ్రామాల్లో ప్రజలు పనుల కోసం దూరప్రాంతంలోని మండల కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థలు అందుబాటులోకి తేవడంతో సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అవుతున్నాయని చెప్పారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయ భవనం, ఆర్‌బీకే భవనాలు నిర్మాణం జరగడంతో గ్రామాలు కొత్తరూపు సంతరించుకున్నాయన్నారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, ఎంపీడీఓ శర్మ, మాజీ సర్పంచ్ వాసు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రస్ట్ పేరుతో విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం

- ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి డబ్బు వసూళ్లు
- పోలీస్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

మార్టూరు: అనాథలు, నిరుపేద విద్యార్థులే లక్ష్యంగా వారి భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్న ఓ మోసగాడి లీలలు బయటపడ్డాయి. ఈ విషయమై సోమవారం స్థానిక పోలీస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు.. పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన మురళీకృష్ణ స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌సమీపంలో గతేడాది తులసీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పేరుతో ఆఫీస్ ప్రారంభించాడు. కొంత కాలం తర్వాత మూసేశాడు. ఆ సమయంలో కరోనాతో మరణించిన వారి పిల్లలను, నిరుపేద విద్యార్థులను ఉచితంగా తమ ట్రస్ట్ ద్వారా ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యను చదివిస్తామంటూ ఇంటర్ పాస్ అయిన విద్యార్థుల నుంచి ఒరిజనల్ సర్టిఫికెట్‌లు తీసుకున్నాడు. వీటి ద్వారా కొన్ని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజ్‌లలో ఉచిత విద్య అంటూ నమ్మించి, కాలేజీల్లో చేర్పించి యాజమాన్యాలు ఇచ్చే కమీషన్‌లు తీసుకొని పబ్బం గడుపుకున్నాడు.

ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని..

చీమకుర్తికి చెందిన మృదుల అనే విద్యార్థిని ఉచిత విద్య అంటూ గుంటూరు సమీపంలోని సెయింట్ మేరీస్ ఇంజినీరింగ్ కాలేజ్‌లో చేర్పించాడు. కానీ ఎటువంటి సాయం చేయలేదు. హాస్టల్ ఫీజుతోపాటు అన్ని ఫీజులు తానే చెల్లిస్తున్నానని, మురళీకృష్ణను నమ్మి మోసపోయానంటూ కన్నీటి పర్యంతమైంది. అదే మండలం కేవీ అగ్రహారానికి చెందిన హరితోటి త్రివేణి నుంచి 8 నెలల కిందట మురళీకృష్ణ 10వ తరగతి, ఇంటర్ ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకొని ఇంత వరకు తిరిగి ఇవ్వలేదని, ఫోన్ చేస్తే సమాధానం చెప్పడని త్రివేణి సోదరుడు విలేకర్లతో వాపోయాడు. మార్టూరుకు చెందిన కే ప్రశాంత్ ఇంజినీరింగ్ పూర్తి చేయగా ఉద్యోగం ఇప్పిస్తానంటూ గత సెప్టెంబర్ 8వ తేదీన రూ.30 వేలు, 10వ తేదీన రూ.30 వేలు, మొత్తం రూ.60 వేలు గూగుల్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. ఉద్యోగం గురించి అడిగితే సమాధానం చెప్పడం లేదని బాధితుడు వాపోయాడు. సత్తెనపల్లికి చెందిన సీహెచ్ ధనుష్ రవికుమార్‌కు కూడా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి గతేడాది ఆగస్టులో రూ.25 వేలు ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. ఈమేరకు సోమవారం స్థానిక పోలీస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా ఎస్సై కమలాకర్ దర్యాప్తు చేసి నిజానిజాలు తేల్చాలని ఏఎస్‌ఐ సైదాను ఆదేశించారు. మురళీకృష్ణ ఆరాచకాలపై దర్యాప్తు చేస్తే బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అతని బారిన పడి మోసపోయిన అనేక మంది విద్యార్థులు, నిరుద్యోగుల వివరాలు తెలిసే అవకాశం ఉందని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఈ విషయమై మురళీకృష్ణను విలేకరులు వివరణ కోరగా తాను కొందరి నుంచి డబ్బు తీసుకున్న మాట నిజమేనని, అయితే ఉద్యోగం నిమిత్తం కాదని చెప్పడం గమనార్హం.


ట్రస్ట్ వ్యవస్థాపకుడు మురళీకృష్ణ